ప్రజాశక్తి

శుక్రవారం 12 సెప్టెంబర్ 2025 5 శ్రీ సత్యసాయి



జిల్లాలో 689.8 మిల్లీమీటర్ల వర్షపాతం

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

జిల్లావ్యాప్తంగా బుధవారం రాత్రి కురిసిన వర్షానికి 689.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. జిల్లాలో 32 మండలాలకు గాను ఐదు మండలాలు మడకశిర, అమరాపురం, గుడిబండ, రొళ్ల, అగళి మినహా మిగతా 27 మండలాల్లో వర్షపాతం నమోదయింది. అత్యధికంగా ధర్మవరం మండలంలో 72.6 మిల్లీమీటర్లు, తాడిమర్రిలో 52.2, రామగిరిలో 48.4, బుక్కపట్నంలో 38.0, తలుపులలో 36.2, ఎన్ పి కుంటలో 36.0, నల్లమాడలో 36.0, సి కె పల్లి లో 35.2, పెనుకొండ మండలంలో 32.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా మిగతా మండలాల్లో ఒక మోస్తారు వర్షం కురిసిందని గణంకాల శాఖ అధికారి గంగాధర్ తెలిపారు. లేపాక్షిలో అత్యల్పంగా 1.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. చిత్రావతి నది ఎగువ ప్రాంతంలో బాగేపల్లి, నంది హిల్స్ తదితర ప్రాంతాల్లో ఎక్కువ వర్షం కురయడంతో చిత్రావతి నదిలో నీరు పారుతుంది.



కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ప్రారంభిస్తున్న ఎస్పీ వి.రత్న

సాంకేతిక పరిజ్ఞానంతో భద్రతా ఏర్పాట్లు

◆ ఎస్పీ వి.రత్న ◆ పుట్టపర్తిలో కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

నవంబర్‌లో నిర్వహించనున్న సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాలకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లను పరిశీలించడానికి నూతన సాంకేతిక పరిజ్ఞానంతో కమాండ్ కంట్రోల్ రూమ్ ను ఏర్పాటు చేసినట్లు శ్రీ సత్య సాయి జిల్లా ఎస్పీ వి రత్న తెలిపారు. ఈ మేరకు గురువారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో నూతన కమాండ్ కంట్రోల్ బోర్డు రూమ్ ను ఆమె ప్రారంభించారు. సిసి కెమెరాలతో నిఘా కట్టుదిట్టం చేయడంతో పాటు వీటి ద్వారా నేరస్తుల కదలికలపై దృష్టి పెట్టవచ్చునని తెలిపారు. కమాండ్ కంట్రోల్ రూమ్ తో పాటు, సీసీ కెమెరాల ఏర్పాటు, బోర్డు రూమ్ , వీడియో కాన్ఫరెన్స్ హాల్ విభాగాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రాష్ట్ర డిజిపి , డీఐజీ సహకారంతో పాటు ప్రభుత్వ అనుమతితో, ట్రంప్ షులే పరిశ్రమ భాగ్యస్వామ్యంతో కమాండ్ కంట్రోల్ రూమ్, బోర్డు రూమును ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జిల్లాలో నేరాల నియంత్రణకు, నేరస్తులను గుర్తించడానికి సీసీ కెమెరాలు ఎంతో కీలకంగా వ్యవహరించనున్నాయన్నారు. కార్యాలయంలో మీడియా సెంటర్‌ను కూడా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే 2,700 కెమెరాలు ఏర్పాటుచేసి కదిరి ,హిందూపురం , మడకశిర ప్రాంతాల్లో సబ్ కంట్రోల్ రూమ్లు ప్రారంభించి వాడుకలోకి తీసుకొచ్చామన్నారు. వీటితో జిల్లాలో బందోబస్తు ఏర్పాట్లు, నేరస్తుల కదలికలపై డ్రోన్ ,సీసీ కెమెరాలతో దృష్టి పెట్టడం జరిగిందన్నారు. అంతేగాక జిల్లా హెడ్ క్వార్టర్ లో 345 మ్యాట్రిక్స్ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. త్వరలోనే పెనుగొండ, ధర్మవరం, పుట్టపర్తిలో కూడా సబ్ కంట్రోల్ రూములు ఏర్పాటు చేస్తామన్నారు. ఎస్పీ కార్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా జిల్లాలోని నేరస్తుల కదలికలను పోలీసులు పర్యవేక్షిస్తుంటారని ఎస్పీ తెలిపారు. అనంతరం ఎస్పీ కమాండ్ కంట్రోల్ రూమ్ లో ఏర్పాటు చేసిన డయల్ 100, 112 డెస్క్ ను పరిశీలించారు. అత్యవసరమైన కాల్స్ వచ్చిన వెంటనే వాటికి ఏ విధమైన పరిష్కారం చూపుతున్నారని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. త్వరలో జరగనున్న సత్యసాయి బాబా ఉత్సవాలను దృష్టిలో ఉంచుకొని కమాండ్ కంట్రోల్ రూమ్ ను ఏర్పాటు చేసి మరింత చురుగ్గా పనిచేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీతో పాటు, పుట్టపర్తి డీఎస్పీ విజయ్ కుమార్, మహిళా పిఎస్ స్టేషన్ డీఎస్పీ ఆదినారాయణ, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, ఆర్ఐలు వలి, మహేష్, డిసిఆర్‌బి సిఐ శ్రీనివాసులు, సోషల్ మీడియా సిఐ మోహన్, సిసి చిరంజీవి, సోషల్ మీడియా ఎస్ఐ ముని ప్రతాప్, ఐటీ కోర్ ఇన్‌ఛార్జి సుదర్శన్ రెడ్డి, ఎఆర్ ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు బదిలీ

◆ అనంతపురం కలెక్టర్‌గా ఒ.ఆనంద్ ◆ సత్యసాయి కలెక్టర్‌గా శ్యామ్ ప్రసాద్

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఉమ్మడి అనంతపురం జిల్లాల కలెక్టర్లు ఇద్దరూ బదిలీ అయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం గురువారం నాడు 12 మంది కలెక్టర్లను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో ఉమ్మడి అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్లు ఉన్నారు.

అనంతకు ఆనంద్- బాపట్లకు వినోద్ కుమార్

అనంతపురం జిల్లా కలెక్టర్ డా॥వి.వినోద్‌కమార్ బాపట్ల జిల్లా కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో నెల్లురు జిల్లా కలెక్టర్‌గా పనిచేస్తున్న ఒ.ఆనంద్‌ను నియమించారు. డా॥వినోద్‌కుమార్ 2024 సార్వత్రిక ఎన్నికల సమయంలో అనంతపురం కలెక్టర్‌గా నియమితులయ్యారు. ఎన్నికల అనంతరం అన్ని జిల్లాల కలెక్టర్లు బదిలీ అయినప్పటికీ వినోద్‌కుమార్‌ను మార్చలేదు. ఆయనే కొనసాగుతూ వచ్చారు. ఇప్పుడు ఆయన్ను బాపట్ల కలెక్లర్‌గా నియమించారు. ఆయన స్థానంలో నెల్లూరు జిల్లా కలెక్టర్‌గా పనిచేస్తున్న ఒ.ఆనంద్ అనంతకు వచ్చారు. ఈయన 2016 బ్యాచ్‌కు చెందిన ఐఎఎస్ అధికారి. ఆయన్ను 2024 జులై నెలలో అక్కడి కలెక్టర్‌గా ప్రభుత్వం నియమించింది. తాజా బదిలీల్లో ఆయన్ను అనంతపురం కలెక్టర్‌గా ప్రభుత్వం నియమించింది.

సత్యసాయి జిల్లా కలెక్టర్‌గా శ్యామ్ ప్రసాద్

సత్యసాయి జిల్లా కలెక్టర్‌గా ఉన్న టిఎస్.చేతన్ బదిలీ అయ్యారు. కాగా ఈయనకు తాజా పోస్టింగ్ ఎక్కడన్న దానిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదు. 2024 ఎన్నికల అనంతరం ఈయన సత్యసాయి జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఆయన స్థానంలో పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్‌గా ఉన్న శ్యామ్ ప్రసాద్‌ను ప్రభుత్వం నియమించింది. శ్యామ్ ప్రసాద్ కూడా గతేడాది జులై నెలలోనే పార్వతీపురం మన్యం కలెక్టర్‌గా నియమితులయ్యారు. ఆయన్ను ఇప్పుడు సత్యసాయి జిల్లాకు నియమించింది. ఈయన కూడా 2016 బ్యాచ్‌కు చెందిన ఐఎఎస్ ఆఫీసర్. ఇద్దరు కలెక్టర్లు ఒకటి, రెండు రోజుల్లో బాధ్యతలు చేపట్టనున్నట్లు తెలుస్తోంది.



అనంత కలెక్టర్ ఆనంద్



శ్రీ సత్యసాయి కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

గత పాలనలో దారిమళ్లిన సబ్‌ప్లాన్ నిధులు

డా॥ఉండవల్లి శ్రీదేవి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్



విలేకరులతో మాట్లాడుతున్న డా॥శ్రీదేవి


2019 నుంచి 2024 మధ్యకాలంలో నవరత్నాల పేరుతో సబ్ ప్లాన్ నిధులన్నింటినీ దారిమళ్లించి ఎస్సీల అభివృద్ధిని వైసిపి ప్రభుత్వం మరిచిందని ఆంధ్రప్రదేశ్ మాదిగ సంక్షేమ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ ఛైర్‌పర్సన్ డా॥ఉండవల్లి శ్రీదేవి విమర్శించారు. అనంతపురం జిల్లా షెడ్యూల్డు కులాల సేవ సహకార సంఘం కార్యనిర్వాహక సంచాలకుల కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఉమ్మడి అనంతపురం జిల్లా పరిధిలోని ఎస్సీ కార్పొరేషన్ పరిధిలోని షాపింగ్ కాంప్లెక్స్‌ల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. పాతవాటి పునరుద్ధరణ కోసం అవసరమైన నిధులు మంజూరు చేస్తామన్నారు. గత ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్‌కు వచ్చిన నిధులను మూడు ముక్కలాట చేసి పక్కదోవ పట్టించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అట్రాసిటీ చట్టాన్ని నిర్వీర్యం చేసిందన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమలు చేసిన సూపర్ సిక్స్ పథకాలు ప్రజల మన్ననలు పొందాయన్నారు. అధికారంలోకి వచ్చిన 15 నెలల కాలంలోనే రాష్ట్రానికి పదిన్నర లక్షల కోట్ల విలువైన పరిశ్రమల పెట్టుబడులు వచ్చాయంటే అది చంద్రబాబు పాలనా దక్షతకు నిదర్శనం అన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా మహిళల ఉన్నతి పథకం కింద ఐదు లక్షల రూపాయల లబ్ధి చేకూరుస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ కుముద, మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ గంగాధర్, పాల్గొన్నారు.

'పట్టు'ను దేశంలోనే నెంబర్ వన్ చేసేందుకు కృషి

రాష్ట్ర స్థాయి పట్టు రైతుల సదస్సులో సిల్క్ బోర్డు మెంబర్, ఎంపి అంబికా

ప్రజాశక్తి-మడకశిర టౌన్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో పట్టు పరిశ్రమను దేశంలోనే నెంబర్ వన్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని సెంట్రల్ సిల్క్ బోర్డు మెంబర్, ఎంపి అంబికా లక్ష్మీనారాయణ తెలిపారు. పట్టణంలోని యాదవ కళ్యాణ మండపంలో గురు వారం రాష్ట్ర స్థాయి 'నా పట్టు-నా అభిమానం' కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథు లుగా ఎంపిలు బికె. పార్థసారథి, అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, సెంట్రల్ సిల్క్ బోర్డు డైరెక్టర్ సురేష్ బాబు, రాష్ట్ర ఉద్యానవన పట్టు పరిశ్రమ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్సీ గుండమల తిప్పేస్వామి హాజరయ్యారు. కేంద్ర, రాష్ట్ర పట్టు పరిశ్రమ శాఖలు సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర నలుమూలల నుంచి రైతులు, శాస్త్రవేత్తలు హాజరయ్యారు. సెంట్రల్ సిల్క్ బోర్డు మెంబర్, ఎంపి అంబికా మాట్లాడుతూ జపాన్, చైనా, దక్షిణ కొరియా నుంచి అధికంగా సిల్క్‌ను దిగుమతి చేసుకునేవారమని ప్రస్తుతం దేశంలో పట్టు పెంపకం అధికం కావడంతో 50 శాతం శాతం దిగుమతిని తగ్గించామన్నారు. బై వోల్టిన్ రకం పట్టు పెంపకంలో ముందున్నామ న్నారు. ఎమ్మెల్యే రాజు మాట్లాడుతూ శాస్త్రవేత్తలు పరిశోధనల్లో కనుగొన్నవి రైతు పొలాల్లో కనిపించాలన్నారు. పట్టు పరిశ్రమ సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించడంతో పాటు రైతులను సిఎం చంద్రబాబుతో కలిపి సమస్యలను వివరించామన్నారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో కూడా పట్టు రైతుల సమస్యలపై మాట్లాడుతానన్నారు. రాష్ట్రంలో ఆర్థికంగా ఇబ్బంది ఉన్న పట్టు రైతులకు న్యాయం చేస్తామని తెలిపారు. వైసిపి ప్రభుత్వం పట్టు పరిశ్రమ శాఖను నిర్లక్ష్యం చేసిందన్నారు. సిల్క్ బోర్డ్ డైరెక్టర్ మాట్లాడుతూ మడకశిర ప్రాంతంలో బైవోల్టిన్ ఉత్పత్తి అధికంగా ఉన్న నేపథ్యంలోనే సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించడం కోసం ఇక్కడ రాష్ట్రస్థాయి రైతుల సదస్సు నిర్వహించామన్నారు. శాస్త్ర సాంకేతికతను రైతు ముంగిటకు చేర్చడమే 'నా పట్టు-నా అభిమానం' (మేరా రేషం-మేరా అభిమాన్) లక్ష్యమన్నారు. పట్టు పరిశ్రమ శాఖ అభివృద్ధికి సెంట్రల్ సిల్క్ బోర్డ్ ప్రస్తుతం రూ. 4వేల కోట్లు కేటాయిస్తుందని, దీన్ని రూ. 7,500 కోట్లకు పెంచాలని కేంద్ర ప్రభుత్వానికి విన్నవించామన్నారు. రాష్ట్రస్థాయి వర్క్ షాప్ నిర్వహించి మల్బరీ సాగుకు అవసరమైన యాంత్రీకర ణ పనిముట్లు, పట్టుగూళ్లతో తయారైన వస్త్రాలతో స్టాల్స్ ఏర్పాటు చేసి రైతులకు అవగాహన కల్పించా మన్నారు. సిరికల్చర్ ఒక ఆరోగ్యకరమైన సాగు ఉద్యమమని తెలిపారు. యాంత్రీకరణ ద్వారా 75 శాతం సబ్సిడీ అందించడానికి కూడా ప్రయత్నిస్తున్నామని తెలిపారు. ఎపి హార్టికల్చర్ అండ్ సిరికల్చర్ డైరెక్టర్ కె.శ్రీనివాసులు మాట్లాడుతూ జిల్లాకు రూ. 2.9 కోట్లు కేటాయించామన్నారు. ఇప్పటికే చంద్రికల కోసం రూ. 4 కోట్లు మంజూరయ్యాయని, రాష్ట్రవ్యాప్తంగా 16 వేల రేషం షెడ్ల నిర్మాణం కోసం రూ. 29 కోట్లు మంజూరయ్యాయన్నారు. రైతులకు ఇవ్వాల్సిన ఇన్సెంటివ్ కూడా ప్రభుత్వ పరిశీలనలో ఉందన్నారు. బైవోల్టీన్ రకం రైతులకు లాభదాయకమైన పంట అన్నారు. రాష్ట్రంలో 6 జిల్లాల్లో 'నా పట్టు-నా అభిమానం' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సిరికల్చర్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ యాంత్రీకరణ పద్ధతులను రైతులకు తెలియజేసి అధిక పట్టు ఉత్పత్తిని సాధించేందుకు ఈ సదస్సు దోహదపడుతుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 16 వేల మంది రైతులకు రూ. 89 కోట్ల పట్టు పరిశ్రమ షెడ్లు మంజూరైనట్లు తెలిపారు. పట్టు పరిశ్రమ శాఖ అడిషనల్ డైరెక్టర్ అరుణ్ కుమారి మాట్లాడుతూ కుప్పం, పలమనేరు, మడకశిర, తదితర ప్రాంతాలు పట్టుకు పుట్టినిల్లు అన్నారు. చిన్న, సన్నకార రైతులు పట్టుపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారన్నారను. ఆరేళ్లుగా ఇన్సెంటివ్ అందలేదని, ఇన్సెంటివ్ వచ్చేలా కృషి చేయాలన్నారు. అనంతరం 30 మంది ఉత్తమ పట్టు రైతులను సత్కరించారు. పట్టు పరిశ్రమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్ ఆకట్టుకున్నాయి. పట్టు చీరలు, పట్టు స్వెటర్లు, పట్టు కోట్లు వివిధ రాష్ట్రాల్లో పట్టు తయారు చేసే వస్తువులను ప్రదర్శనలో ఉంచారు. కార్యక్రమంలో పట్టు పరిశ్రమ శాఖ శాస్త్రవేత్తలు, పట్టు పరిశ్రమ శాఖ అధికారులు, మడకశిర పట్టు పరిశ్రమ శాఖ ఏడి, హనుమంత రాయప్ప నాయక్, స్థానిక నాయకులు శ్రీనివాస్ మూర్తి, చైర్మన్ గురుమూర్తి, మున్సిపల్ చైర్మన్ నరసింహ రాజు, ఒక్కలిగా చైర్మన్ లక్ష్మీనారాయణ, సింగల్ విండో అధ్యక్షులు,డైరెక్టర్లు, పట్టు పరిశ్రమ రైతులు తదితరులు పాల్గొన్నారు.



పట్టు రైతును సత్కరిస్తున్న సిల్క్ బోర్డు మెంబర్ అంబికా, ఎంపి బికె.పార్థసారథి, గుండుమల తిప్పేస్వామి, అధికారులు

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు లోహిత్‌కుమార్

ప్రజాశక్తి-లేపాక్షి



లోహిత్‌కుమార్

మండలంలోని కొండూరు గ్రామ జడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న లోహిత్ కుమార్ రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు ఎంపికయ్యాడని హెచ్ఎం శేషగిరి బాబు, వ్యాయామ ఉపాధ్యాయులు శివకుమార్ తెలిపారు. అనంతపురంలోని ఆర్‌డిటి స్టేడియం లో ఈ నెల 9వ తేదీ జరిగిన సాఫ్ట్ బాల్ పోటీల్లో లోహిత్‌కుమార్ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ సబ్ జూనియర్ ఛాంపియన్ షిప్ పోటీలకు ఎంపికయ్యాడన్నారు. లోహిత్‌కుమార్ ఈ నెల 26, 27, 28 తేదీల్లో విశాఖపట్నంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి అనంతపురం జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తాడన్నారున. ఆ పోటీల్లో బాగా రాణించి జాతీయస్థాయికి ఎంపిక కావాలని వారు ఆకాంక్షించారు. లోహిత్ ఎంపిక పట్ల హెచ్ఎం శేషగిరిబాబు,వ్యాయామ ఉపాధ్యాయులు శివకుమార్, ఉపాధ్యాయులు శిరీషాదేవి, హితేంద్ర, శ్రీనివాసరావు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.



కాణిపాకంలో నృత్య ప్రదర్శన చేస్తున్న ప్రగతి గ్లోబల్ జెన్ పాఠశాల విద్యార్థులు

కాణిపాకంలో 'ప్రగతి,గ్లోబల్ జెన్' విద్యార్థుల నృత్య ప్రదర్శన

ప్రజాశక్తి-పెనుకొండ

ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలో వెలసిన శ్రీవరసిద్ది వినాయకస్వామి బ్రహోత్సవాల్లో గురువారం పట్టణంలోని ప్రగతి, గ్లోబల్ జెన్ విద్యాసంస్థల విద్యార్థులు కూచిపూడి, భరతనాట్యం నృత్య ప్రదర్శన చేశారు. ప్రగతి, గ్లోబల్ జెన్ విద్యాసంస్థల అధినేత యు.శ్రీనివాసులు ఆధ్వర్యంలో 14 మంది విద్యార్థులు 9 పాటలకు నృత్య ప్రదర్శన చేశారు. అలాగే విద్యార్థులు చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కూచిపూడి, భరతనాట్యంలో విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీవెంకటేశ్వరస్వామి వేషధారణలో విద్యార్థులు 'వేయి నామాలవాడ వెంకటేశుడా' అంటూ అద్భుతంగా ప్రతిభను కనబరిచారు. కార్యక్రమంలో డ్యాన్స్ మాస్టర్ మధు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాన్ని మార్చాలని వినతి



ఆర్డీవోకు వినతి పత్రం ఇస్తున్న బహుజన చైతన్య వేదిక సభ్యులు

పెనుకొండ : రొద్దంలో అంబేద్కర్ విగ్రహానికి సమీపంలో ఉన్న మద్యం దుకాణాన్ని మార్చాలని కోరుతూ గురువా రం బహుజన చైతన్య వేదిక ఆధ్వర్యంలో ఆర్డీఓ ఆనందం కుమార్‌కు వినతిపత్రం ఇచ్చారు. వేదిక అధ్యక్షులు శివరామకృష్ణ మాట్లాడుతూ భారతరత్న అంబేద్కర్ విగ్రహ సమీపంలో మద్యం దుకాణం ఏర్పాటు చేయడం శోచనీయమన్నారు. ఈ విషయాన్ని పలు మార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదన్నారు. పది రోజుల్లోపు దుకాణం మార్చాలని లేనిచో మద్యం దుకాణాన్ని మూసివేసి నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు బాబుప్రసాద్, ప్రధాన కార్యదర్శి రవికుమార్, గౌరవ సలహాదారు నరసింహులు, కెవిపిఎస్ రమణ, కెవిపిఎస్ వెంకటేష్, వేదిక ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు ఈశ్వర్, రామాంజనేయులు, లీగల్ అడ్వైజర్ నరేష్, వేదిక జిల్లా గౌరవాధ్యక్షుడు కదిరప్ప, ఆంజనేయులు, తులసీరామ్ పాల్గొన్నారు.

'ఇదేనా ఆహా.. ఓహో'..?

పెనుకొండలో పునాదుల దశలో ఉన్న మెడికల్ కాలేజీ పరిశీలనలో మంత్రి సవిత ఎద్దేవా

ప్రజాశక్తి-పెనుకొండ

పీపీపీ మోడల్ ద్వారా కూటమి ప్రభుత్వం నిర్మించతలపెట్టిన 10 మెడికల్ కాలేజీల టెండర్లలో పాల్గొనొద్దంటూ వైసిపి అధినేత జగన్ హెచ్చరికలు చేయడంపై రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 'నీ బెదిరింపులకు రాష్ట్రంలో భయపడే వారెవరూ లేరు... బావిలో పడి ఎవరు చావాలో ఇప్పటికే ప్రజలు స్పష్టమైన తీర్పు చెప్పారు' అని ఎద్దేవా చేశారు. తన నీలి మీడియాలో 17 మెడికల్ కాలేజీలు నిర్మించానని.. ఆహా... ఓహో.. అని జగన్ రాయించుకోవడం చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని దెప్పి పొడిచారు. పెనుకొండలో పునాదుల దశలోనే నిలిచిపోయిన మెడికల్ కాలేజీని గురువారం ఆమె కూటమి నాయకులతో కలిసి పరిశీలించారు. మంత్రి విలేకరులతో మాట్లాడారు. 2021లో 17 మెడికల్ కాలేజీలను నిర్మిస్తున్నానంటూ ఆనాడు జగన్‌రెడ్డి ఆర్భాటంగా గాల్లో వచ్చి శంకుస్థాపన చేశారన్నారు. రెండేళ్లలో పూర్తి చేస్తామని డబ్బా కొట్టారన్నారు. ఆయన పదవీ కాలం పూర్తయినా ఏ ఒక్క మెడికల్ కాలేజీని కూడా పూర్తిస్థాయిలో నిర్మించలేదని విమర్శించారు. నిధులున్నా బీసీ హస్టళ్లు, ఎంజెపి స్కూళ్లు, ఇతర భవనాలను సైతం పూర్తి చేయలేదన్నారు. ప్రజాధనంతో నిర్మించిన ప్రజా వేదికను కూల్చడం జగన్‌కు తెలుసని, భవన నిర్మాణాలు మాత్రం చేతకాదని ఎద్దేవా చేశారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని 10 మెడికల్ కాలేజీలను పీపీపీ మోడల్ ద్వారా నిర్మించాలని సిఎం చంద్రబాబు నిర్ణయించారన్నారు. మెడికల్ కాలేజీల నిర్మాణానికి టెండర్లు వేస్తే తమ ప్రభుత్వం వస్తే రద్దు చేస్తానని హెచ్చరికలకు దిగుతున్నారని, జగన్ బెదిరింపులకు రాష్ట్రంలో భయపడేవారేవరూ లేరన్నారు. సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్, మంత్రి అచ్చెన్నాయుడుని బావిలో పడి చావాలని జగన్ అనడంపై మంత్రి తీవ్రంగా స్పందించారు. బావిలో పడి ఎవరు చావాలో గత సాధారణ ఎన్నికల్లో, ఇటీవల జరిగిన పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో ప్రజలు ఇప్పటికే స్పష్టమైన తీర్పు చెప్పారని తెలిపారు. గత టిడిపి ప్రభుత్వాల హయాంలోనే రాష్ట్రంలో వైద్య విద్య అభివృద్ధి చెందిందన్నారు. రాష్ట్రంలో 10 మెడికల్ కాలేజీలను నిర్మించి తీరుతామని స్పష్టంచేశారు. మంత్రి వెంట టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

అబద్ధాలకు బ్రాండ్ అంబాసిడర్ జగన్

'అబద్ధాలు చెప్పడం వైసిపి అధినేత జగన్‌కు అలవాటేనని, ఆయన అబద్ధాలకు బ్రాండ్ అంబాసి డర్' అని రాష్ట్ర మంత్రి ఎస్.సవిత విమర్శించారు. అయిదేళ్ల వైసిపి పాలనలో ఆ పార్టీ నాయకులు ఎన్నో స్కాంలకు పాల్పడ్డారని, వారందరికీ త్వరలో చట్టపరంగా తగిన బుద్ధి చెప్పడం ఖాయమని హెచ్చరించారు. అనంతపురంలో నిర్వహించిన 'సూపర్ సిక్స్-సూపర్ హిట్' సభను విజయవంతం చేయడం పట్ల గురువారం పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో మంత్రి సమావేశం నిర్వహించి కూటమి శ్రేణులకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆర్థిక ఇబ్బందులున్నా సిఎం చంద్రబాబు సూపర్‌సిక్స్ పథకాలు, ఎన్నికల హామీలను నెరవేర్చారన్నారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునేలా పాలన సాగిస్తున్నామని తెలిపారు.

'సూపర్‌హిట్'సభతో జగన్ మైండ్ బ్లాంక్

కడపలో మహానాడు, పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉపఎన్నికల్లో టిడిపి గెలుపు, ఇప్పుడు 'సూపర్ సిక్స్-సూపర్ హిట్' సభ విజయవంతం కావడంతో వైసిపి అధినేత జగన్‌కు మైండ్ బ్లాంక్ అయ్యిందని మంత్రి ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం ఏ మంచి పని చేసినా విషం కక్కడం అలవాటుగా మారిందన్నారు. 2019 ఎన్నికల ముందు అమరావతికి జైకొట్టి, గెలిచిన తరవాత మూడు ముక్కలాటకు దిగారని జగన్‌పై మండిపడ్డారు. సిపిఎస్ ఉద్యోగులు, మహిళలు, ఇలా అన్ని వర్గాల ప్రజలను తన అబద్ధపు మాటలతో మోసగించారన్నారు. ప్రభుత్వంపై వైసిపి చేస్తున్న ప్రతి ఆరోపణపై చర్చించేందుకు జగన్ అసెంబ్లీకి రావాలని సవాల్ విసిరారు. జగన్ అసెంబ్లీలో మహిళలను కించపరిచారని, తాము మాత్రం గౌరవప్రదంగా వ్యవహరిస్తామని తెలిపారు. వైసిపి పాలనలో స్కాంలకు పాల్పడిన ప్రతి వైసిపి నాయకునికి త్వరలో చట్టపరంగా తగిన బుద్ధి చెబుతామని స్పష్టం చేశారు. దోచుకోవడం, దాచుకోవడం వైసిపి లక్ష్యమైతే, రాష్ట్రాభివృద్ధే కూటమి ధ్యేయమని వెల్లడించారు. సమావేశంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




అసంపూర్ణంగా నిలిచిన మెడికల్ కళాశాల పిల్లర్ ఇనుప కడ్డీలను చూపుతున్న మంత్రి సవిత

విద్యుత్ సమస్య పరిష్కరించినందుకు కృతజ్ఞతలు

కొత్తచెరువు రూరల్ : మండలంలోని లోచర్ల పంచాయతీ మామిల్లకుంట క్రాస్‌లోని దళిత వాడలో ఆరేళ్లుగా విద్యుత్ సమస్య నెలకొనడంతో దానిని ఇటీవల అధికారులు పరిష్కరించారు. దీంతో కాలనీవాసులు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు విద్యుత్ శాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కాలనీలో విద్యుత్ సమస్యను వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్ వెంకటేష్ ,స్థానికులు, కలసి అధికారులు దృష్టికి గతంలో తీసుకువెళ్లారు. వారు స్పందించి గురువారం గ్రామానికి చేరుకొని సమస్యను పరిష్కరించారు. దీంతో అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వ్యకాసం జిల్లా కమిటీ నాయకురాలు కురబ రమాదేవి, స్థానికులు గౌరమ్మ, పోతక్క, భాగ్యమ్మ, లక్ష్మీదేవి, మనీ, తిరుపాలమ్మ తదితరులు ఉన్నారు.

కనకదాసు విగ్రహం ధ్వంసంపై ఆగ్రహం

పెనుకొండ : కర్నూలు జిల్లాలో కురుబల ఆరాధ్య దైవం భక్త కనకదాసు విగ్రహం ధ్వంసం చేసిన వారిని తక్షణమే గుర్తించి చర్యలు తీసుకోవాలని మంత్రి సవిత ఆ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్‌ను ఆదేశించారు. ముందుగా మంత్రి కర్నూలు ఎస్పీకి ఫోన్ చేసి ఈ ఘటనపై ఆరా తీశారు. మంత్రి మాట్లాడుతూ ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో గొడవలు సృష్టించేందుకు కొందరు ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడు తున్నారని మండిపడ్డారు. కనకదాసు విగ్రహంపై దాడి చేసిన వారు ఎవరైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కనకదాస విగ్రహాన్ని ధ్వంసంచేసిన వ్యక్తులను గుర్తించి తక్షణమే అరెస్ట్ చేయాలని జిల్లా కురుబ సంఘం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని కురుబ సంఘం కార్యాలయంలో గురువారం సమావేశం నిర్వహించారు. వారు మాట్లా డుతూ కనకదాసు విగ్రహాన్ని ధ్వంసం చేయడం విచారకరమన్నారు. సమావేశంలో కురుబ సంఘం జిల్లా అధ్యక్షులు మల్లికార్జున, నియోజకవర్గ అధ్యక్షుడు రామాంజనేయులు, నాయకులు ఈశ్వర్ ప్రసాద్, నాగేంద్ర, అశ్వర్థ, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కురుబ సంఘం నాయకులు

బంగారు కృష్ణమూర్తికి సత్కారం

ప్రజాశక్తి - కదిరి అర్బన్

ఏపీ స్టేట్ అగ్రికల్చర్ డైరెక్టర్ గా నియమితులైన బంగారు కృష్ణమూర్తికి హిందూపురం వాల్మీకి సంఘం నాయకులు సత్కారం చేశారు. కృష్ణమూర్తి స్వగృహంలో ఆయనను కలసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హిందూపురం వాల్మీకి సంఘం ప్రెసిడెంట్ వెంకటరమణప్ప , సూర్యనారాయణ, లోకేష్, సునీల్, మేకల శివ ప్రసాద్, ముద్దల చిన్న నరసింహులు, బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద బీమాపై అవగాహన

ప్రజాశక్తి - నంబుల పూలకుంట

ప్రమాదాల సంభవించినప్పుడు ప్రభుత్వం నుంచి లబ్ధి పొందే సౌకర్యంపై రిజర్వ్ బ్యాంక్ సిబ్బంది మారుతి స్థానికులకు అవగాహన కల్పించారు. గురువారం మండలంలోని పి కొత్తపల్లి గ్రామంలో నిర్వహించిన సమావేశంలో మారుతి మాట్లాడుతూ ప్రమాద బీమా సౌకర్యం వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ పిచ్చయ్య, సాయి రెడ్డి, లింగమూర్తి, కృష్ణారెడ్డి, వెంకటలక్ష్మి, పద్మావతమ్మ, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

ప్రజాశక్తి - కొత్తచెరువు

మండలంలోని బండ్లపల్లి జిల్లా పరిషత్తు పాఠశాలలో తెలుగు పండితుడిగా పనిచేస్తున్న మాణిక్యం ఇస్సాక్ సెప్టెంబర్ 5వ తేదీ విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా ఆయనకు గురువారం స్థానిక ఎంఇఒ సోమశేఖర్ నాయుడు, పాఠశాల హెచ్ఎం నంజుండప్ప ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాణిక్యం ఇస్సాక్‌ను ఆదర్శంగా తీసుకోవాలనికోరారు. ఈ కార్యక్రమంలో ఆపస్ జిల్లా అధ్యక్షులు అమరా చంద్రబాబు, ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున, గ్రామ సర్పంచి గీతాబాయి, విద్యా కమిటీ చైర్మన్ నాగలక్ష్మి ఉపాధ్యాయుల శ్రీనివాసులు, మల్లికార్జున, శాంతి, తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో కదిరి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - కదిరి టౌన్

అనంతపురంలోని కోవూరు నగర్ విద్యారణ్య స్కూల్ లో ఎం. కే స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎస్.జి.ఎఫ్.ఐ ఫెన్సింగ్ ఉమ్మడి జిల్లా సెలక్షన్స్‌లో కదిరి ప్రాంతానికి చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. కరాటే మాస్టర్ షేక్షావలి ఆధ్వర్యంలో పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు ఫాయిల్, ఇప్పీ, సబర్ విభాగాలలో ప్రతిభను ప్రదర్శించారు. విజేతలు బ్లూ మూన్ స్కూల్, సెయింట్ థామస్ స్కూల్, నారాయణ స్కూల్ విద్యార్థులు డింబు శ్రీ, పావని, వెన్నెల, ప్రేగ్నేష్, విష్ణు, యశ్వంత్, ఫర్హాన్, జగదీష్, మనోహర్, రాజేష్‌కాగా వీరిని స్థానికులు అభినందించారు.

యంత్రాల పరిశీలన

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణ పరిధిలోని మోతుకుపల్లిలో ఉన్న పురపాలక సంఘ డంపింగ్ యార్డులో చెత్తను రీసైక్లింగ్ ద్వారా ఎరువులు తయారు చేస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని గురువారం మున్సిపల్ చైర్మన్ రమేష్ కుమార్, కమిషనర్ మల్లికార్జున రీసైక్లింగ్ చేస్తున్న యంత్రాలతో పాటు పనులను పరిశీలన చేశారు. పనులు పారదర్శకంగా చేసి వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ పరిశీలనలో మున్సిపల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ దస్తగిరి, ఏఈ జనార్ధన్, కౌన్సిలర్ రాఘవేంద్ర, టిడిపి నాయకులు చంద్రమోహన్ యాదవ్, హరీష్ కుమార్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి - నల్లమాడ

మండలంలోని కొండ్రవారిపల్లికి చెందిన తెలుగుదేశం నాయకుడు నరసపు కిష్టప్ప (55) మృతిచెందాడు. నరసపుకిష్టప్ప ఆగస్టు 29న రంగారెడ్డి జిల్లా కడతాల్ జరిగిన రోడ్డు ప్రమాదం లో తీవ్రంగా గాయపడి ఉస్మానియా హాస్పిటల్ లో చికిత్స పొందుతూ మెరుగైన చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. స్థానికటిడిపి నాయకులు కిష్టప్ప మృతదేహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు, అలాగే నరసపు క్రిష్టప్ప కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ మైలే శంకర, డాక్టర్ బుట్టి నాగభూషణం నాయుడు, కొట్లో మంజూ రెడ్డి, మైలే రామచంద్ర,అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎన్ఎస్‌పిఆర్ విద్యార్థులు

ప్రజాశక్తి-హిందూపురం

జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ నిర్వహించిన జిల్లా స్థాయి ఐదు కిలోమీటర్ల పరుగు పందెం పోటీల్లో పట్టణంలోని ఎన్ఎస్‌పిఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినిలు రాధిక, పల్లవి ప్రతిభ కనపర్చి రాష్ట్రస్థాయికి ఎంపిక అయ్యారు. ఈ విద్యార్థినిలను కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ ప్రగతి గురువారం అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ జి. వెంకటేసులు, ఎన్ఎస్ఎస్ పిఒ రంగనాయకులు, సీనియర్ అసిస్టెంట్ బి.నరసింహులు, ఫిజికల్ డైరెక్టర్ విజయలక్ష్మి, సిబ్బంది విజేతలను అభినందించారు.

నిత్యావసర సరుకులు సక్రమంగా అందజేయాలి

ప్రజాశక్తి - గాండ్లపెంట

కార్డుదారులకు ప్రతి నెలా అందిస్తున్న నిత్యావసర సరుకులను సక్రమంగా అందజేయాలని తహశీల్దార్ బాబురావు ఆదేశించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో గురువారం చౌక ధాన్య డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్‌తో పాటు సిఎస్‌డిటి వాణి ఈ నెల 16వ తేదీ నుంచి దాదాపు 24 ఎఫ్ షాపులకు స్మార్ట్ కార్డులను టీముల ద్వారా లబ్ధిదారులకు అందజేస్తామని తెలిపారు ఈనెల 28న ఆర్డీవో కార్యాలయంలో డీలర్లకు ఈ పాస్ మిషన్లపై అవగాహన నిర్వహించి నూతనంగా ఈపాస్ మిషన్లు పంపిణీ చేస్తారని వారు తెలిపారు

రైతుకు తగినంత యూరియా సరఫరా చేయాలి : వ్యకాసం



సమావేశంలో పాల్గొన్న నాయకులు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

సత్య సాయి జిల్లాలో రైతులకు అవసరమైనంత యూరియాను సరఫరా చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఫిరంగి ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. స్థానిక కార్మిక ,కర్షక కార్యాలయంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా అధికంగా మొక్కజొన్న పంటను పండిస్తున్నారని ఆ పంటకు కనీసం మూడుసార్లు అయినా యూరియా వేయాల్సి ఉంటుందని చెప్పారు. కానీ ప్రభుత్వం యూరియా పంపిణీ విషయంలో విఫలమైందని రాష్ట్రంలో 200 కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి యూరియా సరఫరా చేస్తున్నామని చెబుతున్నారే తప్ప ఆచరణలో మాత్రం అది శూన్యంగా మారిపోయిందని విమర్శించారు. జిల్లా వ్యాప్తంగా రైతులు ఆర్ బీ కే సెంటర్ల వద్ద వ్యవసాయ గోడౌన్ల వద్ద పడిగాపులు కాసి కనీసం ఒక బస్తా కూడా ఇంటికి తీసుకుపోలేని దుర్భరమైన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. తక్షణమే ఎకరాకు 10 బస్తాలు యూరియా సరఫరా చేయాలని లేనిపక్షంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో రైతులను కలుపుకొని జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేష్ ,జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్, జిల్లా కమిటీ సభ్యులు, రమాదేవి, ప్రమీల,శోభ, నూర్ జహన్, తదితరులు పాల్గొన్నారు.

సమాచార శాఖ ఏడీగా సిహెచ్. పురుషోత్తం

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్



బాధ్యతలు స్వీకరిస్తున్న పురుషోత్తం

జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ సహాయ సంచాలకులుగా సిహెచ్. పురుషోత్తం నియమితులయ్యారు. ఈయన నంద్యాల జిల్లా డిఐపిఆర్ఒగా పనిచేస్తూ సహాయ సంచాలకులుగా సత్యసాయి జిల్లాకు వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన పురుషోత్తంకు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాలను విస్తృతంగా ప్రచారం చేయడానికి సిబ్బంది సమన్వయంతో పని చేయాలన్నారు. పాత్రికేయుల సమస్యలు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అంతకు ముందు ఇక్కడ పనిచేస్తున్న వేణుగోపాల్ రెడ్డి ఉద్యోగోన్నతిపై నెల్లూరు జిల్లాకు బదిలీ అయ్యారు. ఈసందర్భంగా ఆయనను సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎఐఇ రామాంజనేయులు, డిపిఆర్ఒ మస్తాన్ సాబ్ సిబ్బంది పాల్గొన్నారు.

పార్టీ అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-హిందూపురం

పార్టీ అభివృద్ధి కోసం తాను నిరంతరం శ్రమిస్తానని రాష్ట్ర భూత్ కమిటీ వింగ్ జాయింట్ సెక్రెటరీ వరుణ్ రెడ్డి పేర్కొన్నారు. హిందూపురం పురపాలక సంఘం కొల్లకుంటకు చెందిన వరుణ్ రెడ్డిని రాష్ట్ర బూత్ కమిటీ జాయింట్ సెక్రెటరీగా నియమిస్తూ రాష్ట్ర కమిటీ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో గురువారం పార్టీ కార్యాలయంలో వరుణ్ రెడ్డి నియోజకవర్గ సమన్వయకర్త దీపిక వేణు రెడ్డికి, మున్సిపల్ వైస్ చైర్మన్ బలరామిరెడ్డి, ఇతర కౌన్సిలర్లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు లోకేష్, తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు

'రణభేరి'ని విజయవంతం చేయండి : యుటిఎఫ్

ప్రజాశక్తి - కదిరి టౌన్

రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగ, ఉపాధ్యాయులకు, సంబంధించిన ఆర్థిక, ఆర్థికేతర విద్యారంగా సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్లతో రాష్ట్రవ్యాప్తంగా యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 15 వ తేదీ నుండి 19 తేది వరకు నిర్వహించే రణభేరిని విజయవంతం చేయాలని యుటిఎఫ్ జిల్లా కోశాధికారి శ్రీనివాసులు ,జిల్లా కార్యదర్శులు సి తాహెర్ వలి, వై వి సుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ఎం ఆర్ సి ప్రాంగణంలో జిల్లా నాయకులు సునీల్ కుమార్, పట్టణ అధ్యక్షుడు మధుసూదన్ ఆధ్వర్యంలో రణభేరి గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు రమేష్, ఖాజాపీర్, బ్రహ్మేంద్ర, నజీర్, సుధాకర్, రమణ నాయక్, మనోహర్ , బాలాజీ నాయక్, ఇర్ఫాన్, భార్గవ్, జబిఉల్లా, ఖాదర్ బాషా, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా యూరియా పంపిణీ : కలెక్టర్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

జిల్లాలో పారదర్శకంగా యూరియా పంపిణీకి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ టిఎస్ చేతన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ లో కలెక్టర్ తో పాటు జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ యూరియా పంపిణి పై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎక్కడ యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ఎంత యూరియా అవసరమో వారానికి సరిపడే విధంగా ముందుగానే ప్రతిపాదనలు పంపాలన్నారు. రైతులకు యూరియా వినియోగంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.

జిల్లాలో ఉన్న చెరువులన్నీ నీటితో నింపాలి : జిల్లాలో ఉన్న అన్ని చెరువులను నీటితో నింపే విధంగా చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కలెక్టరేట్ లో ఆ శాఖ అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 15 చెరువులు పూర్తి నీటి సామర్థ్యంతో ఉన్నాయన్నారు. 17 చెరువులు 75 శాతం, 55 చెరువులు 50 శాతం సామర్థ్యంతో ఉన్నాయన్నారు. మొత్తం 1186 చెరువులకు గాను 815 చెరువులలో నీరు లేవన్నారు. హంద్రీనీవా నీటితో ఈ చెరువుల నింపాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో చిన్న నీటి పారుదల శాఖ ఎస్ ఈ విశ్వనాథ్ రెడ్డి, ఈ ఈలు గురుమూర్తి, సురేందర్, డ్వామా పిడి విజయేంద్రప్రసాద్, భూగర్భ జల శాఖ డిడి రాజశేఖర్, వ్యవసాయ అధికారి రమానాయక్, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి కష్ణా నాయక్, పరిశ్రమల శాఖ జిఎం నాగరాజు, మార్క్ఫెడ్ డి ఎం గీతా తదితరులు పాల్గొన్నారు.

టీకాల ద్వారా గాలికుంట వ్యాధిని అరికడదాం : పాడి పశువులకు గాలి కుంట వ్యాధి సోకకుండా ముందు జాగ్రత్తగా వ్యాధి నిరోధక టీకాలు వేసి అరికడదామని కలెక్టర్ పేర్కొన్నారు. కలెక్టరేట్ లో ఆ శాఖ అధికారులతో కలిసి కలెక్టర్ జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకం గోడ పత్రికలను



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

విడుదల చేశారు. ఈనెల 15 నుంచి వచ్చే నెల 15 వరకు గాలి కుంట వ్యాధి నిరోధక టీకాలు కార్యక్రమం జరుగుతుందన్నారు. పశుసంవర్ధక శాఖ అధికారులు రైతులకు ఈ వ్యాధి గురించి వివరించి టీకాలు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ శాఖ జెడి శుభదాస్, పశు వైద్య అధికారి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

గత వారం రాజస్థాన్..ఇప్పుడు కేరళ ...

మున్సిపల్ కమిషనర్‌కు అరుదైన అవకాశాలు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునకు వరుసగా అరుదైన అవకాశాలు లభిస్తున్నాయి. కమిషనర్ మల్లికార్జున గతవారం పారిశుధ్య నిర్వహణ విధానాలపై అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదికను ఇవ్వడానికి రాజస్థాన్‌లోని జైపూర్, ఉదయపూర్ తదితర పట్టణాలను పర్యటించి అక్కడి పరిస్థితులను అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. కేరళ ప్రభుత్వం అర్బన్ కాన్ క్లేవ్ 2025 సదస్సును కేరళ రాష్ట్రంలోని కొచ్చిలో నిర్వహిస్తోంది. శుక్రవారం, శనివారం రెండు రోజుల పాటు జరుగుతున్న ఈ సదస్సుకు రాష్ట్రం నుంచి ఏడుగురును ఎంపిక చేశారు. ఇందులో హిందూపురం మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునకు చోటు దక్కింది. సదస్సుకు హాజరు కావడానికి గురువారం హిందూపురం మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున పయనమయ్యారు. మున్సిపల్ చైర్మన్ రమేష్ కుమార్ తో పాటు ఉద్యోగులు కమిషనర్ మల్లికార్జునను అభినందించారు.



మున్సిపల్ కమిషనర్ మల్లిఖార్జున

ప్రభుత్వ ఆసుపత్రికి దుప్పట్లు వితరణ

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి 200 బెడ్ షీట్లను పట్టణంలోని పుట్టపర్తి రోడ్ సాయి నగర్ లో గల స్పందన హాస్పిటల్ అధినేతలు డాక్టర్ బషీర్, డాక్టర్ సోనియా దంపతులు అందజేశారు. ఈ మేరకు వారు గురువారం ఆసుపత్రి సూపరింటెండెంట్ తిపేంద్ర నాయక్ చేతులు మీదుగా హెడ్ నర్స్ రమాదేవికి అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సోనియా మాట్లాడుతూ ధర్మవరంలోని ప్రభుత్వ ఆసుపత్రి వందలాదిమంది రోగులకు చక్కటి వైద్య చికిత్సలను అందిస్తూ ప్రజల మన్ననలు పొందుతోందన్నారు. ఇందుకు తన వంతుగా 200 బెడ్‌షీట్లను అందజేసినట్లు చెప్పారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ తిప్పేంద్ర నాయక్ మాట్లాడుతూ స్పందన హాస్పిటల్ పేద ప్రజలకు వివిధ రకాలుగా ఆరోగ్య సేవలను చేస్తోందని, ఇందులో భాగంగా ప్రభుత్వ ఆసుపత్రికి గతంలో కంటికి సంబంధించిన 40 వేల రూపాయలు విలువచేసే పరికరాలు అందించడం, తిరిగి రెండవసారి బెడ్ సీట్లు పంపిణీ చేయడం నిజంగా అభినందించదగ్గ విషయమని తెలిపారు.అనంతరం డాక్టర్ సోనియాను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ హరి, నరసింహులు, నజీర్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఉదయ భాస్కర్, డాక్టర్ శివప్రసాద్ నాయక్, నితిన్ రెడ్డి, వైష్ణవి, మాధవి, ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ నరసింహులు, పుల్లమ్మ, రాధమ్మ, నర్సింగ్ సూపరింటెండెంట్ రమాదేవి, స్పందన ఆసుపత్రి సిబ్బంది బాబా ఫక్రుద్దీన్, దిల్దార్ తదితరులు పాల్గొన్నారు.

అనధికార లేఅవుట్ ప్రహరీ తొలగింపు

ప్రజాశక్తి-హిందూపురం

పురపాలక పరిధిలోనిసడ్లపల్లి సమీపంలో ఏలాంటి అనుమతులు లేకుండా వేసిన లే అవుట్ ప్రహరీని మున్సిపల్ అధికారులు గురువారం తొలగించారు. సడ్లపల్లి సమీపంలో వ్యవసాయ భూమిలో ఎటువంటి అనుమతులు పొందకుండా 2.50 ఎకరాల భూమిలో లే అవుట్ నిర్మాణం చేస్తున్నారు. ఇందులో భాగంగా చుట్టూ ప్రహరీ నిర్మాణం చేశారు. ప్రహరీ లోపల లే అవుట్ వేయడానికి భూమిని చదును చేస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారుల బృందం అక్కడికి చేరుకుని చుట్టూ నిర్మాణం చేసిన గోడను జెసిబి ద్వారా తొలగించారు. ఈ సందర్భంగా ఎసిపి చంద్రమ్మ మాట్లాడుతు అనుమతులు లేకుండా లే అవుట్ వేస్తే వాటిని తొలగించడంతో పాటు యజమానులపై శాఖ పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - కొత్తచెరువు

భవన నిర్మాణ కార్మికుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని. భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కోశాధికారి అంకే ముత్యాలు డిమాండ్ చేశారు. ఈనెల 15వ తేదీన నిర్వహించే అమరావతిలోని లేబర్ కమిషనర్ కార్యాలయం ముట్టడి కార్యక్రమానికి సంబందించిన పోస్టర్లను నాయకులు గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్యసాయి జిల్లాలోని అన్ని మండలాల నుండి కార్మికులు పాల్గొని లేబర్ కమిషనర్ కార్యాలయం ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు లక్ష్మన్న, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన

ప్రజాశక్తి - నల్లచెరువు

'బాల్య వివాహాల నిర్మూలన-లైంగిక వేధింపుల నుండి రక్షణ' చట్టాలపై నల్ల చెరువు కస్తూరిబా గాంధీ విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ నది ప్రమీల సూచనల మేరకు స్థానిక ఐసిడిఎస్ అధికారి లలితమ్మ అధ్యక్షతన జిల్లా బాలల పరిరక్షణ విభాగం సిబ్బంది డీసీపీవో మహేశ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. బాల్యవివాహాల వలన జరిగే అనర్థాల గురించి వివరించారు.ాఈ కార్యక్రమంలో , బాలల సంరక్షణ విభాగం సిబ్బంది నాగలక్ష్మి, ప్రసన్నలక్ష్మి, స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఒ వెంకట లక్ష్మమ్మ, జయమ్మ, ఎన్జీవో సంస్థల సిబ్బంది సమత ఎన్జీవో శారద , రెడ్స్ సంస్థ నుండి మనోహర్ , పాఠశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీ రైతు సంఘం మండల కన్వీనర్‌గా రామిరెడ్డి

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు

ఏపీ రైతుసంఘం మండల కన్వీనర్ గా నల్లగుంట్ల పల్లి కి చెందిన జి. రామిరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా అధ్యక్షులు హరి ఆధ్వర్యంలో రామిరెడ్డిని ఎపిరైతుసంఘం మండల కన్వీనర్‌గా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా రామిరెడ్డి గురువారం రైతుసమస్యల పరిష్కారానికి పోరాటాలు చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు రమణ, స్థానిక రైతులు ప్రభాకర్ రెడ్డి, నరసింహారెడ్డి, వెంకట రమణ, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

జెవివి రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - కదిరి అర్బన్

శాస్త్రీయ విజ్ఞానాభివృద్ధికి పనిచేస్తున్న జనవిజ్ఞాన వేదిక నిర్వహించుకుంటున్న రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని జెవివి జిల్లా అధ్యక్షులు బి నరసారెడ్డి పేర్కొన్నారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర మహాసభలు ఈనెల 13, 14 తేదీలలో విజయనగరం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరగనున్నాయన్నారు. ముఖ్యఅతిథిగా మాజీ శాసన మండలి సభ్యులు,ప్రముఖ రాజకీయ, సామాజిక విశ్లేషకులు ప్రొఫెసర్ కె నాగేశ్వరరావు హాజరవుతున్నారు. రెండేళ్లపాటు జరిగిన కార్యక్రమాలను సమీక్షించుకొని భవిష్యత్ కార్యక్రమాలను రూపొందిస్తామని ఆయన పేర్కొన్నారు. సత్య సాయి జిల్లాలోని జన విజ్ఞాన వేదిక నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని రాష్ట్ర మహాసభలు విజయవంతం చేయాలని ఆయన కోరారు.

నేరాలు ఘోరాలు

హత్యకేసులో నిందితుడికి రిమాండ్

ప్రజాశక్తి - చిలమత్తూరు

మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో ఆదివారం రాత్రి మద్యం మత్తులో కట్టుకున్న భార్య లక్ష్మిదేవి ని గొడ్డలితో నరికి చంపిన రాఘవేంద్రను 14 రోజులు రిమాండ్ కు తరలించినట్లు ఎస్ఐ మునీర్ అహ్మద్ తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ బుధవారం కోర్టులో హాజరు పరచి రిమాండ్ కు తరలించామన్నారు.

మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్‌పై కేసు

ప్రజాశక్తి - కదిరి అర్బన్

కదిరి పరిధిలోని కుటాగుళ్ల గ్రామానికి చెందిన జంగాల లక్ష్మి అనే మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ కౌన్సిలర్, మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ అజ్జుగుట్టి రాజశేఖర్ రెడ్డితో పాటు రఘునాథరెడ్డి, మంజునాథ, ఈశ్వరయ్యపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు సీఐ నారాయణరెడ్డి తెలిపారు.యర్రగుంటపల్లి గ్రామంలోని జగనన్న కాలనీ నందు ఒకటిన్నర సెంటు ప్రభుత్వ స్థలం ఇంటి పట్టగా ఇప్పిస్తానని తన వద్ద 75 వేల రూపాయలు డబ్బులు తీసుకున్నారని, అలాగే తనతో పాటు మరికొందరి వద్ద కలిపి సుమారు 4, 80,000 రూపాయలు తీసుకొని పట్టాలు ఇప్పించకుండా మోసం చేశారని బాధితులు ఫిర్యాదులు తెలిపినట్లు సిఐ తెలిపారు. ఆ విషయం గురించి అడిగితే అంతు చూస్తామని బెదిరిస్తున్నారని ఇచ్చిన ఫిర్యాదు పేర్కొన్నారన్నారు. ఈ మేరకు బాధితులు ఇచ్చిన ఫిర్యాదు పై కేసు నమోదు చేశామని విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని సిఐ తెలిపారు.

గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - హిందూపురం రూరల్

రూరల్ పరిధిలోని అప్పుల కుంట గ్రామంలో గురువారం గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని గుర్తించినట్లు రూరల్ సిఐ ఆంజనేయులు తెలిపారు. మృతురాలి వయస్సు 40 సంవత్సరాల నుండి 50 సంవత్సరాల లోపు ఉంటుందని తెలిపారు. మృతురాలి వివరాలు తెలిసిన వారు రూరల్‌స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

పాముకాటుతో మహిళ మృతి

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ధర్మవరం మండల పరిధిలోని ఓబులనాయుని పల్లికి చెందిన కొల్లి సరోజమ్మ (56) అనే మహిళ పాముకాటుతో మృతిచెందింది. గురువారం తన పొలములో పంటకు మందు పిచికారి చేస్తున్న సమయంలో పాముకాటుకు గురైంది. దీంతో ద్విచక్ర వాహనంలో సరోజమ్మను ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతురాలికి భర్త చలపత్తి, కొడుకు గోవర్ధన్, ఒక కుమార్తె ఉన్నారు.

వ్యక్తి పై కేసు నమోదు

ప్రజాశక్తి - కదిరి టౌన్

పట్టణంలోని వాల్మో కొరియర్ పార్సిల్ సర్వీస్‌లో బ్రాంచ్ మేనేజర్ గా పనిచేసే సాదిక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అదే బ్రాంచిలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న విజయ్‌కుమార్‌పై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. బ్రాంచిలో ఆర్థికలావాదేవీలు చూసుకుంటూ ఉండే విజయ్ కుమార్ మూడు రోజులకు చెందినకొరియర్ పార్సిలకు సంబంధించిన సుమారు రూ. 1.80 లక్షల నగదును బ్యాంకుకు కట్టకుండా సొంతంగా వాడుకొని మోసం చేశాడని సాదిక్ ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఆ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆర్డీవో, తహశీల్దార్‌పై లోకాయుక్తలో ఫిర్యాదు

ప్రజాశక్తి - చిలమత్తూరు

పెనుకొండ ఆర్డీవో ఆనందకుమార్, చిలమత్తూరు ఇన్‌ఛార్జి తహశీల్దార్ వెంకటేష్ లపై ఆంధ్ర ప్రదేశ్ లోకాయుక్తకు ఆర్టిఐ సమాచార ప్రచార కార్యకర్త ఆంజినేయులు ఫిర్యాదు చేశారు. చిలమత్తూరు మండలం లో కర్నాటక కు చెందిన రియల్టర్ భూ ఆక్రమణలు, రైతులకు చేసిన మోసాలు, కోట్ల లో ప్రభుత్వ సబ్సిడీ లు అక్రమ మార్గాల్లో లబ్ది పొందడం వంటి అంశాల్లో చర్యలు చేపట్టాల్సిన వీరు రియల్టర్ కు సహకరించారని, రియల్టర్‌తో లంచాలు తీసుకున్నారని ఆర్టిఐ సమాచార ప్రచార కార్యకర్త ఆంజినేయులు గురువారం కర్నూల్ కు వెళ్లి లోకాయుక్తలో ఆధారాలతో సహా ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ కంటికి ఆధారాలు కనిపిస్తున్నా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. సుమారు 120 ఎకరాలు ప్రభుత్వ భూమి ఆక్రమణ చేసుకున్నట్టు అధికారులు గుర్తించినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం, నోటీసులు ఇచ్చి వెనక్కి తగ్గడం వంటివి ప్రస్తావిస్తూ భారీ మొత్తం లో లంచాలు తీసుకున్నట్టు ఫిర్యాదు లో పేర్కొనట్టు తెలిపారు. ఈ విషయం జిల్లా కలెక్టర్ దృష్టిలో ఉన్నా అయన ఎలాంటి చర్యలకు ఆదేశించకపోవడం వంటివి ఫిర్యాదులో పొందుపరిచ్చినట్టు తెలిపారు. అవినీతి పాల్పడే వారిని ప్రోత్సహిస్తున్నారని, స్థానికంగా ఉండే రైతులు ఇబ్బందులు పడుతుంటే తమ స్వలాభాలు చూసుకున్న ఆర్డీవో, తహసీల్దార్ లపై చర్యలు తీసుకోవాలని ఆయన ఫిర్యాదు లో పేర్కొన్నట్టు తెలిపారు.

ఆటోను ఢీకొన్న లారీ

మహిళా కార్మికులకు గాయాలు

ప్రజాశక్తి హిందూపురం

హిందూపురం రూరల్ మండలం పెనుగొండ రహదారి మణే సముద్రం గ్రామ సమీపంలో గురువారం సాయంత్రం ఆటోను లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఎనిమిది మంది మహిళా కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన మహిళా కార్మికులు కర్ణాటక రాష్ట్రం గౌరీబిదనూరు సమీపంలో జాకీ గవర్నమెంట్ పరిశ్రమలో కార్మికులుగా విధులు నిర్వహిస్తున్నారు. విధులు పూర్తిచేసుకుని వారి స్వగ్రామానికి ఆటోలో వెళుతున్నారు. మణే సముద్రం గ్రామం సమీపంలో హిందూపురం నుంచి పెనుగొండ వైపు వెళుతున్న లారీ ఆటోను వెనక నుంచి ఢీకొంది. దీంతో ఆటో చెట్టుకు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ తో పాటు 8 మంది కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. గ్రామ సమీపవాసులు వెంటనే అక్కడికి చేరుకొని 108 సహాయంతో హిందూపురం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై అప్గ్రేడ్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇదే లారీ పొట్లూరు వద్ద ద్విచక్ర వాహనాన్ని ఢీకొని మణేసముద్రం వరకు ఈడ్చుకు వెళ్ళింది. దీంతో ద్విచక్ర వాహనం తునాతునకలయింది. ఈ విషయాన్ని గాయపడిన బంధువులు సోమందేపల్లిలో వారి బంధువులకు సమాచారం ఇచ్చారు. సోమందేపల్లి లో స్థానికులు లారీని పట్టుకొని పోలీసులకు అప్పగించారు.

అక్టోబర్ 15లోపు గృహ నిర్మాణాల లక్ష్యం చేరుకోవాలి

ప్రజాశక్తి- పుట్టపర్తి అర్బన్

జిల్లాలో గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని అక్టోబర్ 15 లోపు నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేయాలని కలెక్టర్ టిఎస్ చేతన్ ఆ శాఖ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ లో ఎన్టీఆర్ గృహ నిర్మాణాల పథకం పురోగతిపై సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 72,338 ఇల్లు మంజూరు కాగా ఇందులో 28,240 ఇల్లు పూర్తి అయ్యాయన్నారు. మిగిలిన 40,009 ఇళ్లలో 36,620 వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయన్నారు. ప్రభుత్వం అక్టోబర్ 15న రాష్ట్రవ్యాప్తంగా గృహప్రవేశాలు చేపట్టాలని ఆదేశించిన నేపథ్యంలో జిల్లాలో లక్ష్యం పూర్తి చేయడానికి ఇంకా 4260 ఇల్లు మిగిలి ఉన్నాయన్నారు. వాటిని మండలాల వారీగా లక్ష్యం విధించి పూర్తి చేయడానికి సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. లబ్ధిదారులను చైతన్యపరిచి నిర్ణీత గడువులోగా పూర్తి చేయడానికి కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ పిడి వెంకటనారాయణ, ఈఈ లక్ష్మీనారాయణమ్మ, డీఇ లు శివకుమార్ నాయక్, శంకర్ లాల్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న అధికారులు